క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లె, సిద్దవటం 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ల పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ అధికారి జయచంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పైరెండు సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సిద్దవటం : మండలంలోని మహబూబ్‌నగర్‌లో సోమవారం 12 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తమకు అందిన సమాచారంతో సిద్దవటం మండలం మాధవరం–1 గ్రామ పంచాయతీ పరిధిలోని మహబూబ్‌నగర్ గ్రామ సమీపంలోని ముళ్లపొదల్లో పేకాట స్థావరంపై దాడులు చేసి 12 మందిని అరెస్టు చేశామన్నారు. అక్కడ ఉన్న పేకముక్కలతో పాటు రూ.1,12,630 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ భూమిలో పైపులైన్ తొలగింపు



పైప్‌లైన్ తొలగిస్తున్న దృశ్యం

పెనగలూరు : మండలంలోని కొండూరు పంచాయతీ దామనచెర్ల వద్ద ప్రభుత్వ భూమిలో వేసిన పైపులను తహసీల్దార్ శ్రీధర్ రావు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎవరైనా రైతులు, ప్రజలు ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుండా పైపులైన్, బోర్లు వేసినా, ఆక్రమించుకున్నా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో అగ్నిప్రమాదం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

రాజంపేట రూరల్ : ఏరియా ఆసుపత్రిలోని టీఎస్ఎఫ్ వార్డులో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఫైర్ అధికారి శివశంకర్‌రెడ్డి తన సిబ్బందితో వెళ్లి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.40 వేలు విలువ చేసే ఏసీ మిషన్ కాలిపోయినట్టు తెలియజేశారు. అదే విధంగా వార్డు మొత్తం నల్లటి పొగతో కమ్ముకుందన్నారు. ఎల్ఎఫ్ రవీంద్రబాబు, డీఓపీ శివ, ఎఫ్ఎంలు రాజేశ్వర్, శివశంకర్, చక్రిలు ఉన్నారు.

హమీమ్ ఖాన్‌కు డాక్టరేట్



లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లెకి చెందిన హమీమ్ ఖాన్ అనంతపురం జవహర్‌లాల్ సాంకేతిక విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పట్టా పొందారు. డాక్టర్ టీ నారాయణ రెడ్డి, అలియా సుల్తాన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కంపెనీలు సామర్థ్య అధికారిత మానవ వనరుల అభ్యాసం, ఉద్యోగ నిలుపుదలపై థీసిస్‌ను సమర్పించినందుకు అనంతపురం జేఎన్‌టీయూ డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూవేషన్ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నానని హమీమ్ ఖాన్ తెలిపారు. పలువురు హమీమ్‌ఖాన్‌కు అభినందనలు తెలియజేశారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెంఎంగా శ్రీనివాసరాజు



ఉత్తర్వులు అందజేస్తున్న డీఈఓ రాఘవరెడ్డి

రాయచోటి టౌన్ : రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా కొండూరు శ్రీనివాసరాజు నియమితులయ్యారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన చంద్రశేఖర్ సస్పెన్షన్‌కు గురయ్యారు. దీంతో ఆ పాఠశాల (ఎఫ్ఏసీ) ప్రధానోపాధ్యాయుడిగా నియమిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి నుంచి ఉత్తర్వులు అందుకున్నారు.

గుట్టకు నిప్పు

ములకలచెరువు: స్థానిక మండల కేంద్రంలో ఉన్న నల్లగుట్టకు గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం నిప్పంటించారు. మంటలు పెద్ద ఎత్తున వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అప్పటికే గుట్ట మొత్తం మంటల వ్యాపించడంతో ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను కట్టడి చేశారు.

శివరాత్రి ఉత్సవాలకు భారీ బందోబస్తు

- ఏర్పాట్లను పరిశీలించిన కడప డీఎస్పీ వెంకటశివారెడ్డి
- రాజంపేటలో నేడు అధికారుల సమీక్ష

సిద్దవటం : నిత్యపూజ స్వామి కోనలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని కడప డీఎస్పీ వెంకటశివారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని సిద్దవటం ఈద్గా వద్ద, వంతాటిపల్లె గ్రామ సమీపంలోని నిత్యపూజ స్వామి ఆర్చి వద్ద ఉన్న స్థలాలలను వాహనాల పార్కింగ్‌కు సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన సిద్దవటం పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ నుంచి కోనలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, వాహనాల రాకపోలకు ఇబ్బంది కల్గకుండా ఉండేందుకు భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. బందోబస్తులో ఇద్దరు డీఎస్పీలు, 6 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లు, 20 మంది సబ్ ఇన్‌స్పెక్టర్‌లు, 150 మంది పోలీసులు, మహిళా పోలీసులు, హోం గార్డులు, ఎన్‌సీసీ, వలంటీర్లు(స్టూడెంట్స్), మొబైల్‌పార్టీతో కలిపి 200లు నిత్యం పర్యవేక్షిస్తుంటారన్నారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, ఎస్ఐ తులసీ నాగప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఓబులవారిపల్లె : గుండాలకోనలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ విశ్వనాథరెడ్డి, సర్పంచ్ ఈశ్వరయ్య



సిద్దవటం: పార్కింగ్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐ

గుండాలకోనలో ఏర్పాట్లు పరిశీలించిన సీఐ

ఓబులవారిపల్లె : రెండో తలకోనగా పేరుగాంచిన వైకోట గుండాలకోన శివరాత్రి సందర్భంగా అక్కడి ఏర్పాట్లను సోమవారం రైల్వేకోడూరు సీఐ విశ్వనాథ రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, వైకోట సర్పంచ్ ఈశ్వరయ్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లెం ఈశ్వరయ్య మాట్లాడుతూ వైకోట నుంచి దాదాపు 28 కిలోమీటర్లు శేషాచల అడవులలో గుండాలకోనలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో బండరాళ్లను తొలగించే పనులు చేస్తున్నామన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూస్తామన్నారు. సీఐ విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

ఏర్పాట్లపై సమన్వయ సమావేశం

రాజంపేట రూరల్ : మహాశివరాత్రిని పురస్కరించుకొని పుణ్యక్షేత్రాలలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై 20 ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించనున్నట్లు ఏఓ శిరీషా తెలియజేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో సోమవారం ఏఓ విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఉదయం 11గంటలకు నిర్వహించే ఈ సమన్వయ సమావేశంలో సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు



పాల్గొన్న రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య డైరెక్టర్లు

వీరబల్లి : రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి కృషి చేద్దామని ఏపీఎంలు ఖాదర్ వలీ, జవహర్ బాషాలు అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన మండల రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య బోర్డు ఆఫ్ డైరెక్టర్ల కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యవసాయంపై పెట్టుబడికి కావాల్సిన రుణాలను తక్కువ వడ్డీతో ఇస్తున్నామన్నారు. ప్రతి రైతు తృణధాన్యాల పంటలు వ్యవసాయంలో ఒక భాగంగా పండించాలని కోరారు. ప్రభుత్వం 2023–24 ఏడాదిని తృణధాన్యాల సంవత్సరంగా పరిగణించిందన్నారు. కార్యక్రమంలో సీసీ వెంకటలక్ష్మి, సమాఖ్య అధ్యక్షుడు కె.సుబ్బరామరాజు, కార్యదర్శి రామాంజనేయులు, కోశాధికారి శివయ్య, రైతు మిత్రలు జనమేజయుడు, వెంకటేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : గ్రామాలలో నీటి సంరక్షణపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరెడ్డి కోరారు. జల సంజీవన్ మిషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో జల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 2024 నాటికి ప్రతి ఒక్కరికీ మంచి నీటి కుళాయిలు ద్వారా 55 లీటర్ల నీటిని అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమన్నారు. జల సంజీవన్ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. వీడబ్ల్యూఎస్‌వి కమిటీలు ఏర్పాటు చేసి కమిటీలు ద్వారా అందిస్తామన్నారు. ఎఫ్‌టీకే నీటిని పరీక్షించే పనిపైన ఉన్న యూనిట్లు మహిళా సంఘాలు కలిసి గ్రామంలోని నీటి సమస్య వారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. నీటిని టెస్ట్ ద్వారా పరీక్షలు నిర్వహించి ఆ గ్రామంలోని మంచినీటి శాతాన్ని గుర్తించి అవసరమైనంతవరకు మంచినీరు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్ కుమార్, టీటీఎం కుళ్ళాయప్ప, నీటి పరిరక్షణ అధికారి పెంచల్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యమే పరమావధిగా పని చేయండి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు కృష్ణ, శేఖర్



సీహెచ్‌ఓలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న రమేష్‌బాబు

రాజంపేట రూరల్ : గ్రామాలలోని ప్రజల ఆరోగ్యమే పరమావధిగా సీహెచ్‌ఓ(ఎంఎల్‌హెచ్‌పీ)ల పనితీరు కొనసాగాలని డిప్యూటి డీఎంహెచ్‌ఓలు ఎస్‌సీ కృష్ణ, సానే శేఖర్‌లు ఉపదేశించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలోని పీపీ యూనిట్‌లోని ప్రత్యేక భవనంలో సోమవారం ఆయుష్మాన్ భారత్, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్, ఎక్స్‌పెండెడ్ ప్యాకేజీ సర్వీస్‌లపై సీహెచ్‌ఓ(ఎంఎల్‌హెచ్‌పీ)లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని మెడికల్ సూపరింటెండెంట్ పీపీ నాగేశ్వరరాజుతో కలసి డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు కృష్ణ, శేఖర్‌లు ప్రారంభించి సీహెచ్‌ఓలకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం స్టేట్ మాస్టర్ ట్రైనర్ డాక్టర్ రమేష్‌బాబు, ట్రైనర్‌లు డాక్టర్ వికాస్, డాక్టర్ అశోక్‌లు ప్రజలలోకి సీహెచ్‌ఓలు తీసుకెళ్లాల్సిన సర్వీస్‌లను వివరించారు. ముఖ్యంగా ఎమర్జెన్సీ, కన్ను, చెవి, ముక్కు, గొంతు సమస్యలపై దృష్టి సారించాలని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీలత, ఎంపీహెచ్‌ఈఓ, సీహెచ్‌ఓ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి పిచ్చయ్య, సీనియర్ అసిస్టెంట్ సిద్దిరామయ్య, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

పెద్దయ్యస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలందుకుంటున్న పెద్దయ్యస్వామి

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామంలో వెలిసిన మాలే పెద్దయ్య స్వామికి మాఘమాసం పురస్కరించుకుని గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువకులు శివమాలలు ధరించి మాఘస్నానాలు ఆచరించి స్వామి వారికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

జయంతి రైలును నందలూరులో ఆపాలి



సీపీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నందలూరు(రాజంపేట) : ముంబాయి– కన్యాకుమారి మధ్య నడిచే జయంతి (అయ్యప్పల బండి)ఎక్స్‌ప్రెస్ రైలును నందలూరు రైల్వేకేంద్రంలో నిలుపుదల చేయాలని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ ప్రధాన కార్యదర్శి బాలాంజినేయులు సోమవారం తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌ఓ రాకేష్‌ను కలిసి కోరారు. కోవిడ్ రాక ముందు నందలూరులో జయంతి ఎక్స్‌ప్రెస్ రైలు నిలిచేదన్నారు. ఇప్పుడు నిలపడంలేదన్నారు. ఇందుకు సీపీఆర్‌ఓ సానుకూలంగా స్పందించారన్నారు. నందలూరులో జయంతి రైలు నిలుపుదల అంశాన్ని జీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు.

అర్జీదారులకు అన్నదానం



అర్జీదారులకు భోజనం వడ్డిస్తున్న దాతలు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాయం ఎదుట ప్రతి సోమవారం నిర్వహించే అన్నదాన కార్యక్రమం మదనపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు హబీబ్‌ఖాన్ ఆధ్వర్యంలో అర్జీదారులకు అన్నదానం నిర్వహించారు. అర్జీదారులకు ఉచితంగా ప్రతి సోమవారం అందజేస్తున్న అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. రుచికరంగా ఉండటంతో పాటు శుభ్రమైన భోజనాన్ని అందిస్తున్నారని అర్జీదారులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల ప్రచారబాట

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల) అధ్యాపకులు కళాశాలలో ప్రవేశాల కోసం ప్రచారబాట పట్టారు. కళాశాలలో లభించే సౌకర్యాలు, వసతులు, అందించే కోర్సులకు సంబంధించిన సమాచారాన్ని కరపత్రాలుగా ముద్రించి వివిధ జూనియర్ కళాశాలల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం కడప నగరం ఎన్‌జీఓ కాలనీలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు విచ్చేసి విద్యార్థులకు డిగ్రీ విద్యపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు డా. బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డా. సి. నాగేశ్వర్‌రెడ్డి డా. భూషణ్‌రెడ్డి, డా. టి. వెంకటేశ్వర్లు, డా. వి. శ్రీనీత, డా. లీలావర్ధిని, కె. శ్రీనివాసులు, ఎం. శ్రీనివాసులు, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్‌లోపు వజుఖానా పనులు పూర్తి



పనులను ప్రారంభిస్తున్న మైనార్టీ పెద్దలు

రాయచోటి అర్బన్ : రంజాన్ పర్వదినం ప్రార్థనల లోపు స్థానిక ఈద్గా మైదానంలో వజుఖానా పనులు పూర్తిచేస్తామని ఈద్గా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఖాన్ అన్నారు. సోమవారం ఈద్గా మైదానంలో నూతనంగా నిర్మించనున్న ఓజుఖానా పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ మిధున్‌రెడ్డి తన ఎంపీ గ్రాంటు నుంచి రూ.10లక్షల నిధులను వజుఖానా నిర్మాణానికి ఇచ్చారన్నారు. ఈద్గా కమిటీ అధ్యక్షుడు బేపారి బషీర్‌ఖాన్ ఆధ్వర్యంలో ముస్లిం, మైనార్టీ మతపెద్దలతో కలసి పనులను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ఫయాజుర్ రహిమాన్, మైనార్టీ పెద్దలు ఫజులుల్ బేగ్, గౌస్‌పీర్, అంజద్, బేపారి జబీవుల్లాఖాన్, షాకీర్, అసద్, అనస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌టీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సంబేపల్లె : మండల వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ క్యాలెండర్‌ను, డైరీని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ అవుల విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్‌రెడ్డిలు సోమవారం ఆవిష్కరించారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఎన్నో నిధులు వెచ్చిస్తోందన్నారు. ఇందులో భాగంగా అమ్మఒడి, నాడు–నేడు, జగనన్న విద్యాకానుక, గోరుముద్ద, ఆన్‌లైన్ పాఠ్యాంశాల కోసం ట్యాబ్‌లను ఇచ్చి కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తోందన్నారు. ఎంతో ఖర్చుతో కూడుకున్న బైజూస్ సంస్థతో కలిసి పిల్లలకు ఆధునాతన విద్యను ఇస్తుండటం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్యామల, సర్పంచ్ రామచంద్ర, ఎంపీటీసీ భద్రయ్య, జిల్లా, మండల వైఎస్ఆర్‌టీఎఫ్ అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీఎండీసీకి భూ సేకరణ పరిశీలన



భూ సేకరణను పరిశీలిస్తున్న తహసీల్దార్ పీర్ మున్నీ

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీ భూసేకరణకు సోమవారం ముక్కావారిపల్లి పంచాయతీలోని సర్వే నెంబరు. 1099లోని భూములను తహసీల్దార్ పీర్‌మున్నీ, ఏపీఎండీసీ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మంగంపేట ఏపీఎండీసీకు ఇప్పటికే 100 ఎకరాల భూమిని సేకరించామని, ఇంకా 36 ఎకరాల భూమి అవసరమని ఏపీఎండీసీ ప్రతిపాదించడంతో ముక్కవారిపల్లిలోని సర్వే నెంబరు. 1099లోని భూములను పరిశీలిస్తున్నామని ఆమె తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులకు ఏపీఎండీసీ ద్వారా పరిహారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎండీసీ డిప్యూటీ మేనేజర్ బెనర్జీ, సర్వేయర్ భవానీ, ఆర్ఐ రామ్మోహన్, వీఆర్‌ఓ శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు రక్తహీనతను అధిగమించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీసీఓ గురుప్రకాష్

సంబేపల్లె : గురుకులాల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులలో రక్తహీనతను అధిగమించడానికి ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని డీసీఓ గురుప్రకాష్ అన్నారు. సోమవారం మండలంలోని దేవపట్ల మిట్టవద్ద ఉన్న అంబేడ్కర్ బాలికల గురుకులాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో మాట్లాడుతూ ఎటువంటి సమస్యలున్నా ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యుత్తమ భోజన మెనూను అందిస్తోందన్నారు. రక్తం తక్కువ వున్న వారు వైద్యపరీక్షలు నిర్వహించుకొని రక్త వృద్ధికి వైద్యులు సూచించిన మందులు, ఆహారాన్ని తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా గుడ్డు, చిక్కీలు తదితర పౌష్టికాహారాన్ని తీసుకుంటే ఆరోగ్యం చేకూరుతుందన్నారు. విద్యార్థినులలో శారీరక, మానసిక ఒత్తిడిలు ఏవైన వుంటే పాఠశాల ఉపాధ్యాయ బృందానికి తెలపాలన్నారు. అనంతరం మెస్‌లోని భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్య గ్రామాలను త్వరితగతిన తరలించండి

ఓబులవారిపల్లె : కాలుష్య గ్రామాలైన మంగంపేట, కాపుపల్లె, హరిజనవాడ, అరుంధతివాడ, అగ్రహారం –2 గ్రామాలను త్వరితగతిన తరలించి పునరావాసం కల్పించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గుత్తిరెడ్డి హరినాథ్ రెడ్డి సబ్ కలెక్టర్ అహ్మద్ ఖాన్‌ను కోరారు. సోమవారం సాయంత్రం రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో అహ్మద్ ఖాన్‌ను హరినాథ్ రెడ్డి, నాయకులు కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలుష్య గ్రామాలను తరలించే ప్రక్రియ వేగవంతం చేయాలని, బాధితులందరికీ నష్టపరిహారం న్యాయబద్ధంగా అందించాలని కోరారు. మంగంపేట సర్పంచ్ మినుగు సుధాకర్, ఎంపీటీసీ హరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొలూరు శ్రీనివాసులు రెడ్డి, దేవకుమార్ రెడ్డి, రాజుగోపాల్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రామకృష్ణ, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



ప్రశంసా పత్రాలతో పతకాలు సాధించిన క్రీడాకారులు

రాజంపేట టౌన్ : ఇటీవల తిరుపతిలో జరిగిన సౌత్‌జోన్ జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో రాజంపేటకు చెందిన ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమి క్రీడాకారులు ప్రతిభచాటి పతకాలను సాధించారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక జీఎంసీ క్లబ్‌లో ఆ అకాడమి గ్రాండ్‌మాస్టర్ సునీల్ పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ పోటీల్లో 19 మంది క్రీడాకారులు పాల్గొని అందరు పతకాలు సాధించినట్లు సునీల్ తెలిపారు. వీరిలో నలుగురు స్వర్ణ పతకాలు, నలుగురు రజతం, 11 మంది కాంస్య పతకాలు సాధించారన్నారు. తైక్వాండో ఆత్మరక్షణకు ఎంతగానో దోహదపడగలదని ఆయన తెలిపారు. అలాగే శారీరక దృఢత్వం, మానసికోల్లాసం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అకాడమి ప్రతినిధులు భాస్కర్, చౌడవరం నరసింహులు, ఉమాశంకర్, నరసింహులు, చంద్రశేఖర్, నాగరాజు, గంగారామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ దాడుల్లో సారా ఊట ధ్వంసం

మదనపల్లె : ఎస్ఈబీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏఈఎస్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో 2,000 లీటర్ల సారాఊట ధ్వంసం చేయడంతో పాటు, 10 లీటర్ల నాటుసారా, 14 లీటర్ల బ్రాందీ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జ్ సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆదివారం నాటుసారా రవాణా కేసులో పట్టుబడిన వాల్మీకిపురం మండలం మేకలవారిపల్లెకు చెందిన కుక్కలగంగులప్ప ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం నిమ్మనపల్లె మండలం సామకోటవారిపల్లెలో దాడులు నిర్వహించామన్నారు. గ్రామానికి తూర్పుదిక్కున అటవీప్రాంతంలో ఏడు డ్రమ్ముల నిండుగా నాటుసారా తయారీకి పనికివచ్చే 1,400 లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. అలాగే వాల్మీకిపురం మండలం ఎర్రగుంట్లబావి గ్రామానికి తూర్పున అటవీప్రాంతంలో మూడు డ్రమ్ములు నిండుగా 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. గంగులప్పకు కోర్టు14రోజులు రిమాండ్ విధించారన్నారు.

గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించండి



కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న గట్టుదళితవాడ వాసులు

రాయచోటి అర్బన్ : దశాబ్దాలుగా రోడ్డు సౌకర్యం లేని సంబేపల్లె మండలం శెట్టిపల్లె గ్రామం ఒంటిల్లు బిడికికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో గిరిజనులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నాను చేపట్టారు. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విశ్వనాథనాయక్ మాట్లాడుతూ స్వాతంత్య్రం సిద్ధించి 75 సంవత్సరాలవుతున్నప్పటికీ నేటికి బిడికికి రహదారి లేకపోవడం దారుణమన్నారు. దీంతో బిడికికి చెందిన ప్రజలు, గర్భిణులు అనారోగ్యం పాలైతే ఎద్దుల బండ్లపై ఆసుపత్రికి తరలించాల్సి వస్తోందంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గిరిజన తండాకు వెంటనే రోడ్డు సౌకర్యం కల్పించి ప్రజలను ఆదుకోవాలంటూ కోరారు. అనంతరం వారు ఈమేరకు ఒక వినతి పత్రాన్ని జేసీ తమీమ్ అన్సారియాకు అందజేశారు.

ఆక్రమణను తొలగించండి..

తమ ఊరికి వెళ్ళేదారిని కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకుని తమకు వెంటనే దారి సౌకర్యం కల్పించాలని గట్టుదళితవాడ వాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లానేత విశ్వనాథ్ ఆధ్వర్యంలో గట్టుదళితవాడ వాసులు రహదారి అక్రమణను వెంటనే తొలగించాలంటూ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ మాట్లాడుతూ సంబేపల్లె మండలం రౌతు కుంట గ్రామం గట్టుదళితవాడకు పూర్వం నుండి పొలాల గుండా మినహాయింపు దారి ఉందన్నారు. దారిని అదే గ్రామానికి చెందిన వ్యక్తులు కబ్జాచేశారన్నారు. ఇదేమని ప్రశ్నించిన దళితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి దారిని కబ్జాచేసిన రెడ్డెయ్య, నరసింహారెడ్డిలపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు దారిసౌకర్యం కల్పించాలంటూ ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఈమేరకు వినతిపత్రాన్ని జేసీకు అందజేశారు.

తరుణంపల్లె దళితులకు భూ పట్టాలు ఇవ్వాలి

పెనగలూరు మండలం తరుణంపల్లె దళితవాడ ప్రజలకు ప్రభుత్వం వెంటనే పట్టాలను మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు డిమాండ్ చేశారు. సోమవారం తరుణంపల్లె దళితవాడ ప్రజలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెనగలూరు మండలం కోడూరు పంచాయతీలోని తరుణంపల్లె లోని 450 కుటుంబాలలో 100 కుటుంబాలు దళితులవి అన్నారు. ఉపాధి లేక వలస వెళుతున్నారని, వారికి ప్రభుత్వం భూమిని అందజేసి ఆదుకోవాలన్నారు. అనంతరం తరుణంపల్లె దళితులతో కలసి జేసీకి వినతిపత్రాన్ని సమర్పించారు. పెనగలూరు సీఐటీయూ నేత మద్దెల ప్రసాద్, ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, కెవిపిఎస్ జిల్లా కో కన్వీనర్ డి.సి.వెంకటయ్య, తరుణంపల్లె దళితులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో సౌర విద్యుత్ ప్లాంట్

రాయచోటి టౌన్ : రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాయచోటి ఐసీఐసీఐ బ్యాంక్ వారి సౌజన్యంతో సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హర్షలత పంకజ్ ఆధ్వర్యంలో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కళాశాల ఆవరణలో విద్యుత్‌కు అంతరాయం రాకుండా పర్యావరణాన్ని రక్షించుకొనే విధంగా సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ సౌర విద్యుత్ ఏర్పాటుకు సహకరించిన ఐసీఐసీఐ బ్యాంక్ సంస్థకు చెందిన క్షేత్రస్థాయి అధికారిణి, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యురాలు రాజేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బి.శివమ్మ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురిపై వేధింపుల కేసు

మదనపల్లె : వరకట్న వేధింపులతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని వలసపల్లె పంచాయతీ మొలకలదిన్నెకు చెందిన రాజశేఖర్ భార్య తులసి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. బాధితురాలు తులసిని అత్తింటివారు గత కొద్దిరోజులుగా అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలో తులసి ఫిర్యాదు చేయడంతో భర్త రాజశేఖర్ అతడి తల్లిదండ్రులు చలపతి, నాగరత్నలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కర్ణాటక రాష్ట్రంలోని అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపాలని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపాలని కోరుతూ అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే ఆపి రాయలసీమకు నీటి కేటాయింపులు చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కర్ణాటక ఎన్నికల్లో గెలవాలని రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా అప్పర్ భద్ర ప్రాజెక్టుకు ఆగమేఘాల మీద జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు.